
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 23 మే 2024



కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు అవకాశం

రంగారెడ్డి అర్బన్, మే 22: కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.నవీన్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2024లో జీపీఏ 7.0 అంతకంటే ఎక్కువ గ్రేడ్ సాధించిన విద్యార్థులు ప్రభుత్వ జిల్లా పరిషత్, మైనార్టీ, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలలు, కేజీబీల్లో చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఈనెల 30 వరకు దరఖాస్తు కోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, కాలేజీ అలాట్‌మెంట్ ఆర్డర్ జూన్ 6న అందజేస్తారని తెలిపారు.

విత్తనాల కోసం బారులు



జనుము, జీలుగ విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

శంకర్‌పల్లి, మే 22 : జనుము, జీలుగ విత్తనాల కోసం రైతులు శంకర్‌పల్లి వ్యవసాయ కార్యాలయం వద్దకు బుధవారం పెద్దఎత్తున తరలివచ్చారు. అధికారులు ఇంతకుముందే రైతులకు టోకెన్లు ఇవ్వడంతో ఉదయం 9 గంటలకే కార్యాలయం వద్ద బారులు తీరారు. అయితే, వ్యవసాయాధికారులు 10 గంటలకు జనుము, జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. మండలానికి జనుము విత్తనాలు 150 క్వింటాళ్లు రాగా, జీలుగ విత్తనాలు 44 క్వింటాళ్లు వచ్చాయి. ఒక్కో రైతుకు పట్టాదారు పాసు పుస్తకంపై ఒక బస్తాను అందజేశారు. జనుములు ఒక బస్తాలో 40 కిలోలు ఉండగా, జీలుగలు 30 కిలోలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా, జీలుగలు 30 క్వింటాళ్లు మిగిలాయని, జనుములు నేడు(గురువారం) మరో 60 క్వింటాళ్లు అందుబాటులో ఉంచుతామని వ్యవసాయాధికారి సురేష్‌బాబు తెలిపారు.



సుందర మనోహరం

ఎర్ర ఎర్రాని సూరీడు.. ఎండనిచ్చే సూరీడు... జీవకోటికి ప్రాణం సూరీడు.. పంటలకు ప్రాణం సూరీడు.. లోకబాంధవుడు సూరీడు... అందరి నేస్తం సూరీడు సప్తవర్ణాలతో ఆకాశం మబ్బుల్లో నుంచి ఉదయించాడు. ఆలయ శిఖరం, కొబ్బరి చెట్టు చాటు నుంచి లేత పసుపు, ఎరుపు వర్ణంతో కూడిన సూర్యకిరణాలు నేలను తాకిన సుందర దృశ్యం బుధవారం ధారూరులో ఆవిష్కృతమైంది.

ధారూరు, మే 22



రైతుల చూపు.. పత్తి వైపు!

ఈ సంవత్సరం వానాకాలంలో రైతులు పత్తి సాగు చేసేందుకు ఉత్సాహాన్ని చూపుతున్నారు. దీంతో ప్రభుత్వం కూడా పత్తి సాగుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాది 1,29,088 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా ఈ ఏడాది 1,76,174 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇతర పంటల సాగుకు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వ్యవసాయ ప్రణాళికలో తెల్ల బంగారానికే అగ్రస్థానం

- జిల్లాలో 4.5లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు
- గత ఏడాది కంటే 45వేల ఎకరాల సాగు పెంపు
- వానాకాలం పంటల సాగుకు సన్నద్ధం
- అందుబాటులో 48,292 క్వింటాళ్ల విత్తనాలు
- 1,01,982 టన్నుల ఎరువులు సిద్ధం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో వానాకాలం (ఖరీఫ్) పంటలకు వ్యవసాయ శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లాలో వానాకాలంలో వివిధ పంటల సాగుకు సంబంధించిన వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేసింది. అలాగే సీజన్‌కు సరిపడా విత్తనాలు, రసాయన ఎరువుల నిల్వలను కూడా రెడీ చేస్తోంది. గడిచిన ఏడాది వానాకాలం సాగు విస్తీర్ణం పెరగడంతో దీనికి అనుగుణంగా ఈ ఏడాది సాగు విస్తీర్ణ లక్ష్యాన్ని పెంచారు. ఈ వానాకాలం జిల్లా వ్యాప్తంగా 4,45,428 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. గత ఏడాది కంటే ఈసారి 45వేల ఎకరాలు అధికం. వానాకాలం పంటల సాగులో ఈసారి పత్తికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఈ ఏడాది కూడా పత్తికి గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉండడంతో ప్రభుత్వం పత్తిసాగు పెరిగే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేసి ఈ మేర ప్రణాళిక తయారు చేసింది. వాస్తవానికి గత ఏడాది రైతులంతా పత్తివైపు మొగ్గు చూపడంతో గణనీయంగా పత్తిసాగు పెరిగింది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కూడా పత్తి సాగు పెంచేందుకు నిర్ణయించింది. గత ఏడాది 1,29,088 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా ఈ ఏడాది 1,76,174 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అలాగే గత ఏడాది వరి 1,40,238 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ఈ ఏడాది 1,38,187 ఎకరాలు సాగు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. వరిసాగు గత ఏడాదితో పోలిస్తే దాదాపు రెండువేల ఎకరాలు తక్కువ. అయితే మొక్కజొన్న, కంది, జొన్న పంటల సాగు గతం కంటే పెంచాలని నిర్ణయించారు. ఈ ఏడాది మొక్కజొన్న 66,530 ఎకరాల్లో, కంది 11,548 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇదిలా ఉంటే ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి అవసరమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎరువులతో పాటు విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో దాదాపు 48,292 క్వింటాళ్ల విత్తనాలు, 1,01,982 టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. భూసారం పెంచేందుకు పంటలకు ముందు వేసే జీలుగ, జనుము పంటలకు సంబంధించిన విత్తనాలను 60శాతం సబ్సిడీపై అందించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి తెలిపారు. రాయితీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను జిల్లాలోని డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాల్లో వీటిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీలుగ విత్తనాలు క్వింటాల్ ధర రూ.9,300 కాగా సబ్సిడీపై వీటిని రూ.3,720కే అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే జనుము విత్తనాలు క్వింటాల్ ధర 9,050 కాగా రైతులకు రూ. 3,620కే రాయితీతో అందిస్తున్నట్లు చెప్పారు.

వానాకాలం వ్యవసాయ ప్రణాళిక (ఎకరాల్లో)

పంట	సాగు విస్తీర్ణ లక్ష్యం
పత్తి	1,76,174
వరి	1,38,187
మొక్కజొన్న	66,530
కంది	11,548
జొన్న	3,361
వేరుశనగ	550
ఇతర పంటలు	49,078
మొత్తం	4,45,428

విత్తన నిల్వలు లక్ష్యం క్వింటాళ్లలో)

పంట	విత్తన నిల్వలు
వరి	34,547
మొక్కజొన్న	5,322
కందులు	346
జనుము	1,498
జీలుగ	280
జొన్న	134
మినుము	43
ఇతర పంటలు	3913
పత్తి ప్యాకెట్లలో (450గ్రా)	4,91,036



రసాయన ఎరువుల నిల్వల ప్రణాళిక (టన్నుల్లో)

ఎరువులు	నిల్వలు
యూరియా	41,115
డీఏపీ	14,897
ఎస్ఎస్‌పీ	4,283
ఎంఓపీ	5,139
కాంప్లెక్స్	36,548
మొత్తం	1,01,982

విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దు

- జిల్లా కలెక్టర్ శశాంక
- అమ్మ ఆదర్శ పాఠశాలల తనిఖీ

మొయినాబాద్ రూరల్, మే22 : రానున్న నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా విద్యశాఖాధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన చందానగర్, నాగిరెడ్డిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణతో పాటు ప్రధానమైన సమస్యలపై ఆ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ శశాంక మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఎటువంటి ఇబ్బం



దులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులతో పాటు అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎంతగానో కృషి చేస్తుందని చెప్పారు. పాఠశాలల్లో వసతులు, డిజిటల్ క్లాస్‌రూంలు అందుబాటులోకి తేవాలన్నారు. ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది తల్లిదండ్రులకు చూపించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఎంపీడీఓ సంధ్య, మండల ఇంచార్జి విద్యాధికారి వెంకటయ్య, ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తనాలను అధిక ధరలకు విక్రయించొద్దు: వ్యవసాయాధికారి

కడ్తాల్, మే 22: విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. విత్తనాలు విక్రయించినప్పుడు రైతులకు విధిగా డీలర్లు రశీదులు ఇవ్వాలని ఆమె సూచించారు. కడ్తాల మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను బుధవారం ఏవో శ్రీలత తనిఖీ చేశారు. రికార్డులను, ఎరువుల వివరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఈ-పాస్ ద్వారానే అధీకృత డీలర్లు ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మినీ స్టేడియం ఏర్పాటు కలేనా?

- మహేశ్వరంలో హామీలకే పరిమితమైన స్టేడియం నిర్మాణం
- రియల్ వెంచర్లు, వ్యవసాయ క్షేత్రాల్లో క్రీడాకారుల సాధన
- కొరవడిన ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల ప్రోత్సాహం

మహేశ్వరం, మే 22 : పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా మహేశ్వరంలో మినీ స్టేడియ నిర్మాణం మాత్రం పదేళ్లుగా హామీలకే పరిమితమైంది. స్టేడియం నిర్మాణానికి ఎవరూ శ్రద్ధవహించడం లేదు. గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం కరువైంది. మహేశ్వరంలో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ నాయకుల మధ్య సమన్వయ లోపంతో స్టేడియం నిర్మాణానికి నోచుకోవడం లేదు. మహేశ్వరం సర్వే నంబర్ 306తో పాటు సిరిగిరిపురం రెవెన్యూలోగల ప్రభుత్వ భూమిలో మినీ స్టేడియాన్ని నిర్మించేందుకు అనుకూలంగా ఉందని రెవెన్యూ అధికారులు సూచించినా నిర్మాణానికి మాత్రం ప్రభుత్వం ముందుకు రావడంలేదు. ఇందుకు ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపమే కారణం అనే విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ ఒక మినీ స్టేడియం నిర్మించాలని విద్యార్థులు, క్రీడాకారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. మినీ స్టేడియం లేనందున మహేశ్వరంలో ప్రభుత్వ పరంగా, ప్రైవేట్‌గా క్రీడలు ఏవైనా ఏర్పాటు చేయాలంటే వ్యవసాయ భూములు, చిన్నపాటి పాఠశాలల ప్రాంగణాలే దిక్కవుతున్నాయి. గ్రామాల్లో యువత, క్రీడాకారులు, విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో ప్రావీణ్యం ఉన్నప్పటికీ అనువైన మైదానం లేక సాధన చేయలేకపోతున్నారు. మినీ స్టేడియం ఉంటే రోజూ ప్రాక్టీస్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మహేశ్వరంలో మినీ స్టేడియం నిర్మాణానికి కృషిచేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.



స్టేడియం లేక మహేశ్వరంలోని ఓ వ్యవసాయ భూమిలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

బ్రహ్మోత్సవాలకు సిద్ధం

- 29నుంచి లక్ష్మీనృసింహస్వామి ఉత్సవాలు
- 30న స్వామివారి కల్యాణం



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన లక్ష్మీనృసింహస్వామి దేవాలయం

తలకొండపల్లి, మే 22: తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరిస్తున్నారు. ఈ నెల 29 నుంచి 30వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ రూ.5 కోట్ల సొంత నిధులతో గత ఏడాది శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయాన్ని నిర్మించారు. దేవాలయంతో పాటు కల్యాణ మండపం, అన్నదాన సత్రం, యాగశాల, అర్చకుల గదులు, సత్రాలు నిర్మించారు. ఆ నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ అర్చకుడు గూడ నర్సింహశర్మ, ఆదిత్యుని మురళీధర్‌శర్మలు వివరించారు. 29న గణపతి పూజ, స్వస్తి హవాచనం, రక్షాబంధనం, రుత్విక్‌గ్వరణం, యాగశాల ప్రవేశం, దీక్షాధారణ, మహాసుదర్శన మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, గణపతి, నవగ్రహ పూజలు, హోమం, కుంకుమార్చన, 30న ఉదయం 11 గంటలకు శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వారి కల్యాణం ఉంటుందని తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు ఉప్పల వెంకటేశ్, మంజుల దంపతులు కోరారు.



పడకేసిన పల్లె పాలన

మురుగు ఏరులై పారుతున్నా పట్టింపు కరువు



చౌదరిగూడలో ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు నీరు

చౌదరిగూడ, మే 22: గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్యం పడకేసింది. సర్పంచ్‌ల కాలం ముగియడంతో ప్రభుత్వం మండల మొదటి శ్రేణి అధికారుల గ్రామాల ఇన్‌చార్జిలుగా నియమించింది. ఎన్నికలకు ముందు ఎప్పుడో ఒకసారి గ్రామాలను సందర్శించిన ప్రత్యేకాధికారులు.. ఆ తర్వాత ఎన్నికల పేరుతో గ్రామాలను సందర్శించిన పాపానపోవడం లేదు. దాంతో గ్రామాల్లో సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పలు గ్రామాల్లోని వాస్తవిక పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' కథనం. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పరిధిలో 24 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాలు, గిరిజన తండాలు ఉన్నాయి. ఆయా గ్రామాలకు మండల తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, విద్యా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులను మండల ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఒక్కో అధికారికి కనీసం మూడు గ్రామాల చొప్పున బాధ్యతలను పెట్టారు. అయినప్పటికీ ఎన్నికలకు ముందు ఒకసారి గ్రామాన్ని సందర్శించిన ప్రత్యేకాధికారులు.. నేడు ఆ గ్రామాలకు వెళ్లిన పాపాన కనిపించడం లేదు. దీంతో గ్రామాల్లో సమస్యలు తాండవం చేస్తున్నాయి. ఓ సందర్భంలో నీటి సమస్యపై ప్రత్యేకాధికారులతో గ్రామస్థులు గొడవ పడిన సందర్భం కూడా ఉంది. పంచాయతీ కార్యదర్శులు నిత్యం గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాల్సింది పోయి.. వారు తమ ఇష్టానుసారంగా సమయ పాలన పాటించకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రత్యేకాధికారులు గ్రామాలను సందర్శించి గ్రామ పంచాయతీలోని సమస్యలను గుర్తించి కార్యదర్శులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలి. కార్యదర్శులు సైతం గ్రామాల్లోని సమస్యలను అధికారులకు వినిపించి తమతో అయ్యే పనులను తామే నిర్వర్తించి, కానీ సమస్యలపై ఉన్నతాధికారులకు విన్నవించి ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన అవసరం ఉంది. చౌదరిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మురుగు సమస్య చాలా కాలంగా ఉందని పలువురు తెలిపారు. అదేవిధంగా కొన్ని తండాల్లో నీటి సమస్య ఉంది. అయినప్పటికీ శాశ్వత పరిష్కారాలు కాకుండా తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే కార్యదర్శులకు ప్రత్యేకంగా దిశానిర్దేశం చేస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించే విధంగా అధికారులు కృషి చేయాల్సి అవసరం ఎంతైన ఉంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే వచ్చే వర్షాకాలంలో మురుగు సమస్యతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం లేకపోలేదు.

దోమలు, ఈగలకు నిలయంగా మురుగునీటి గుంతలు

కేశంపేట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక కాలనీలో మురుగునీరు పారుతూ అపరిశుభ్రత నెలకొంది. కాలనీలో మురుగు నీరు పారేందుకు సరైన ఏర్పాట్లు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు కాలనీలోని రోడ్లపై ప్రవహిస్తోంది. దాంతో పరిసర ప్రాంతాల్లో కంపుకొడుతోంది. కాలనీలో పారే మురుగునీరు అక్కడక్కడ గుంతల్లో చేరడంతో అక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. అంతేకాకుండా ఆ ప్రాంతాలు ఈగలు, దోమలకు ఆవాసంగా మారాయి. దాంతో ఈగల, దోమల బెడద ఎక్కువైందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా, డయేరియా వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ అధికారులు కాలనీల్లో సరిగ్గా పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కాకముందే కాలనీలోని మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.



కేశంపేటలోని కాలనీలో పారుతున్న మురుగు

మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలి



విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక కాలనీలో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలి. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు కాలనీ రోడ్లపై ప్రవహిస్తోంది. దాంతో పరిసరాలు కంపు కొడుతున్నాయి. రాత్రి సమయంలో దోమల బెడదతో నిదుర కరువవుతోంది. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

శివాజీ, కేశంపేట

సమస్యను పరిష్కరిస్తాం

విద్యుత్ సబ్‌స్టేషన్ వెనకాల ఉన్న కాలనీలో నెలకొన్న సమస్య మా దృష్టికి రాలేదు. బుధవారం కాలనీని సందర్శించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా. మురుగు కాల్వల నిర్మాణం అవసరం ఉంటే గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించేందుకు ప్రణాళిక తయారు చేస్తాం.

నర్సింహా, ఎంపీవో, కేశంపేట

అప్రమత్తతకు సాంకేతిక దన్ను

● వర్షపాతం, పిడుగు పాటును ముందే పసిగట్టేలా యాప్‌లు

● డౌన్‌లోడ్ చేసుకుంటే రైతులు, సామాన్యులకు మేలు

దౌల్తాబాద్, మే 22 : అకాల వర్షాలు అన్నదాతలకు నష్టాన్ని మిగిల్చాయి. ఏ రోజు వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితి. వర్షాలు, పిడుగుపాటుకు మనుషులు, మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇలాంటి ప్రకృతి విపత్తుల నుంచి రైతులను, ప్రజలను అప్రమత్తం చేసి వారికి దన్నుగా నిలిచేందుకు కేంద్ర వాతావరణ శాఖ ప్రత్యేక యాప్‌లను రూపొందించింది. వీటిని స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే ఏ సమయంలో వర్షం కురుస్తుందో, ఎక్కడ పిడుగు పడే ఆస్కారం ఉందో అనే సమాచారాన్ని భారత వాతావరణ శాఖ రూపొందించిన యాప్‌ల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా ఐదు రోజుల ముందుగా వాతావరణ పరిస్థితులపై తెలుసుకోవచ్చు. స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లోంచి మూడు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతీ యాప్‌కు వినియోగదారుడి పూర్తి వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది.

● రెయిన్ అలారం

రెయిన్ అలారం యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వర్షాలతో కల్లాల్లో వడ్లు తడిసిపోయి రైతులకు నష్టం కలుగుతుంది. రెయిన్ అలారం యాప్ ద్వారా వినియోగదారుడు అందించిన వివరాల మేరకు దాదాపు 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ వర్షం కురిసే సూచనలున్నాయో అనే సమాచారాని అందిస్తుంది. ఈ మేరకు రైతులు అప్రమత్తం అయ్యేం అవకాశం ఉంటుంది.



రెయిన్ అలారం యాప్



దామిని యాప్



మేఘదూత్ యాప్

● దామిని యాప్

ఏప్రిల్, మే నెలల్లో ఈదురు గాలులు వీచి అకాల వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉంటుంది. పొలాల వద్ద రైతులు, కూలీలు, ప్రయాణాల్లో ఉన్న వారు వర్షం ప్రారంభం రాగానే చెట్ల కిందికి వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. వర్షం కురిసే సమయంలో చెట్ల కిందికి వెళ్లడం ప్రమాదకరం. ఎర్తింగ్‌తో చెట్లపై పిగుడులు పడే ఆస్కారం ఉంటుంది. దామిని యాప్ ద్వారా 5 నుంచి 20 నిమిషాల్లో 20కిలో మీటర్ల దూరంలో ఎక్కడ పిడుగు పడుతుందో సమాచారం అందుతుంది.

● మేఘదూత్ యాప్

రైతులు పంటలకు రసాయనిక ఎరువులు పిచికారి చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో పిచికారి చేసి ఇంటికి వచ్చే సరికి వర్షం కురిసి మందులు వృథా అవుతుంటాయి. ఇలాంటి ఇబ్బందులను తొలగించేందుకు వాతావరణ శాఖ మేఘదూత్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను తెలియజేస్తుంది. రానున్న ఐదు రోజుల్లో వాతావరణంలో మార్పులు, వర్ష సూచన, ఆకాశం మేఘావృతం, ఈదురు గాలులు ఏ మేరకు ఏ దిశ నుంచి ఎటు వైపునకు వీస్తాయనే సమాచారాన్ని అందిస్తుంది.

అల్లనేరడుపై యమక్రేజ్!



పరిగి మార్కెట్‌లో అల్లనేరడు అమ్మకాల దృశ్యాలు

- కిలో పండ్లు రూ.300
- పట్టణాల్లో జోరుగా అమ్మకాలు
- అల్లనేరడిలో అనేక ఔషధ గుణాలు

పరిగి, మే 22 : జిల్లాలోని మార్కెట్లలో అల్లనేరడు పండ్ల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో కాపుకొచ్చే అల్లనేరడి పండ్లను జనం ఇష్టపడి కొంటున్నారు. అల్లనేరడిలో ఆయుర్వేద గుణాలు అనేకం ఉన్నాయి. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, పట్టణాల్లో బండ్లపై అల్లనేరడి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అల్లనేరడి రేటు కూడా ప్రియంగానే ఉంది. కిలో పండ్లు రూ.250 నుంచి రూ.300 వరకు కిలో అమ్ముతున్నారు. ధర ఎక్కువ ఉన్నా జనం ఇష్టంతో కొనుగోలు చేసి తింటున్నారు. పరిగి, తాండూరు, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో పొలాల్లో, అడవుల్లో లభించే పండ్లు మార్కెట్లలో విరివిగా లభిస్తున్నాయి. పట్టణాల్లో ఎక్కడ చూసినా అల్లనేరడి కనిపిస్తున్నాయి. పూడూరు, దోమ, ఊటుపల్లి తదితర గ్రామాల్లో అల్లనేరడి తోటలను పెంచుతున్నారు. ఇక్కడ పండించిన పండ్లను జిల్లాలోనే కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముతున్నారు.

అల్లనేరడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు

అల్లనేరడి పండ్లలో ఔషధ గుణం ఉంటుంది. ఈ పండ్లు తినడం ద్వారా వివిధ రకాలుగా విటమిన్లు లభ్యమైతాయి. డయాబెటీస్ రోగులకు ఈ పండ్లు, వాటి విత్తనం మేలు చేస్తాయి. సీజన్‌లో రోజు ఐదారు పండ్లు తినడం ద్వారా చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. కిడ్నీ సంబంధ వ్యాధులను కూడా నయం చేస్తుంది. కిడ్నీలో



చిన్న సైజు రాళ్లు ఉన్న వారు ఈ పండ్లు తింటే కరిగిపోతాయి. అల్లనేరడి పండు ఒకటి, రెండు వ్యాధులకే కాకుండా శరీరానికి అన్ని రకాలా మేలు చేస్తుంది. సీజన్‌లో ఈ పండ్ల ధర ఎంత ఉన్నా కొని తినాలి.



- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పరిగి



పాడి రైతులకు కార్డులు అందజేస్తున్న సత్యనారాయణ

'హెరిటేజ్' పాడి రైతులకు రూ.2 లక్షల ప్రమాద బీమా సదుపాయం

కడ్తాల్, మే 22 : రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను చేపట్టి లాభాలు గడించాలని హెరిటేజ్ డెయిరీ జోనల్ ఇన్‌చార్జి సత్యనారాయణ, ఏరియా మేనేజర్ వెంకటేశంలు అన్నారు. హెరిటేజ్ డెయిరీకి పాలు పోసే ప్రతీ రైతుకు రూ.2 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కడ్తాల మండలం మద్దెల కుంట తండాలో బుధవారం హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణ, వెంకటేశంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెరిటేజ్ ద్వారా కల్పిస్తున్న సదుపాయాలను పాడి రైతులకు వివరించారు. సబ్సిడీపై దాణా, పాడి ఆవులకు ఇన్సూరెన్స్ సౌకర్యం, రుణ సదుపాయం, పశుపోషణ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టాక్‌రాజ్‌గూడ బీఎంసీ ప్లాంట్ మేనేజర్ నరేశ్, సూపర్‌వైజర్ శివ, పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి ఉషారాణి

ఆయిల్‌పామ్ సాగుతో ఎంతో మేలు

కేశంపేట, మే 22: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, రైతులకు అన్నివిధాలా లాభదాయకమని మండల ఉద్యానవన శాఖ అధికారి ఉషారాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట సాగుకు అన్ని విధాలా చేయుతనందిస్తుందని ఉషారాణి తెలిపారు. కేశంపేట మండలం లేమామిడి గ్రామంలో బుధవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ, అవగహన సదస్సు నిర్వహించారు. ఉద్యానవన శాఖ అధికారి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో లేమామిడి, బొదునంపల్లి, గాంధీ శంకర్‌పల్లి, తొమ్మిదిరేకుల, కాకునూర్ గ్రామాలకు చెందిన రైతుల పాల్గొన్నారు. అయిల్‌పామ్ సాగు, దిగుబడి, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం గురించి ఉషారాణి రైతులకు వివరించారు. నీటి వసతి ఉన్న భూముల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ పంటకు చీడ, పీడల బాధకూడా తక్కువ ఉటుందని తెలిపారు. ఆయిల్‌పామ్ దిగుబడి ఎకరానికి 8 నుంచి 12 టన్నులు వస్తుందని వివరించారు. పంటకు పెట్టుబడిగా ప్రభుత్వం మొక్కలపై 90 శాతం రాయితీ, డ్రిప్ ఇరిగేషన్‌కు 80 నుంచి 100 శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. మొక్క నాటిన నాలుగు సంవత్సరాల వరకు ఎకరాకు రూ. 4,200 నిర్వహణ ఖర్చులు ఇస్తుందన్నారు. నాలుగేళ్ల నుంచి పంట దిగుబడి మొదలై 30సంవత్సరాల వరకు వస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులకు డైరీలు అందించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజరత్నం, ఏవో శిరీష, ఆయిల్‌పామ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్, ఏరియా మేనేజర్ ప్రమోద్, ఫీల్డ్ ఆఫీసర్ రుక్మిణి, ఏఈవోలు సమీరా, వినయ్, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.




పోలీసులు స్వాదీనం చేసుకున్న హిటాచీ

అక్రమంగా మట్టి తవ్వకాలు

- హిటాచీని సీజ్ చేసిన పోలీసులు

కేశంపేట, మే 22: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారులోని పో సముద్రంలో నుంచి కొందరు అక్రమంగా మట్టిని తవ్వకుని అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే అక్రమ దందాకు తెరలేపారు. వివరాల్లోకి వెళితే.. సర్వే నెంబర్ 52, 53లలో పో సముద్రం చెరువు ఉంది. ఇందులో సర్వే నెంబర్ 52లో కొంతమేర పట్టాభూమి ఉంది. ఇది ఎఫ్‌టీఎల్‌లో ఉంటుంది. అయితే, కొత్తూర్ మండలం సిద్దాపూర్‌కు చెందిన కొందరు అక్రమార్కులు పోలీసు ఉన్నతాధికారుల పేరును ఉపయోగించుకొని మట్టి అక్రమ రవాణాకు తెరలేపారు. బుధవారం పో సముద్రంలో నుంచి మట్టిని టిప్పర్లతో తరలిస్తున్నరన్న సమాచారంతో రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే అక్కడి నుంచి టిప్పర్లను తరలించారు. మట్టిని తోడిన హిటాచీ అక్కడే ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. అయితే, అక్రమ మట్టి వ్యాపారులు రెవెన్యూ, పోలీసులతో పాటు జర్నలిస్టులను బెదిరింపులకు గురిచేశారు. ఓ పోలీసు ఉన్నతాధికారికి చెందిన భూమి అని.. మీరు ఎవ్వరూ ఏమీ చేయలేరని బెదిరించారు. కేశంపేట పోలీసులు ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నారు.



ప్రహరీ కూలి ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి రెయిలింగ్

వాహనదారులూ జర భద్రం

- ప్రమాదకరంగా తక్కళ్లపల్లి బ్రిడ్జి రెయిలింగ్

యాచారం, మే 22 : హైదరాబాద్-నాగార్జున సాగర్ ప్రధాన రహదారిపై తక్కళ్లపల్లి గేటు వద్ద బ్రిడ్జి ప్రమాదపు టంచునకు చేరింది. ఈ బ్రిడ్జి నిర్మించి 30 ఏళ్లు కావొస్తుంది. బ్రిడ్జికి ఇరువైపులా నిర్మించిన రెయిలింగ్ దిమ్మెలు కూలిపోతున్నాయి. ఇప్పటికే మూడుచోట్ల కూలిపోవడంతో పాటు మరో రెండు చోట్ల కూలడానికి సిద్ధంగా ఉంది. కాగా, వాహనాదారులకు ఇబ్బందిగా మారడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేసి చేతులు దులుపుకోవడంతోనే రెయిలింగ్ కూలిపోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు మరమ్మతులు చేసి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆలంఖాన్‌గూడలో మంచినీటి కొరత



- పట్టించుకోని అధికారులు.. గ్రామస్తుల ఇక్కట్లు

శంకర్‌పల్లి, మే 22 : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన తయారైంది ఆలంఖాన్‌గూడ గ్రామస్థుల పరిస్థితి. ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా తయారవ్వడంతో గ్రామస్తులు తీవ్ర మంచినీటి కొరత ఎదుర్కొంటున్నారు. గ్రామంలో రెండు మంచినీటి ట్యాంకులు ఉన్నా.. నీళ్ల సరిపోవడం లేదు. కాగా మిషన్‌భగీరథ నీరు సరిపోను వస్తున్నా.. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు నీటికొరత ఎదుర్కొంటున్నారు. గ్రామంలో మంచినీటి కోసం రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండగా, రెండు వాల్వ్‌లను ఏర్పాటు చేశారు. అయితే, రోడ్డు వేసే సమయంలో వాటిని పూర్తిగా మూసివేశారు. రెండు వాల్వ్‌లను మూసి వేయడంతో పల్లపు ప్రాంతంలో ఉన్నవారికి సరిపోని నీళ్ల అందుతుండగా, ఎత్తైన ప్రాంతంలో ఉన్నవారికి నీళ్ల సరిపోకపోవడంతో వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. దీంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎంతో ఆర్బాటంగా కుళాయిలను ఇంటి ముందు ఏర్పాటు చేసినా.. చుక్కనీరు రాదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతి పంపులు సైతం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు తెలిపారు. నీళ్ల సరిపోకపోవడంతో బోర్లు ఉన్న ఇంటి యజయానుల వద్ద నుంచి తెచ్చుకుని గొంతు తడుపుకుంటున్నామని వాపోతున్నారు. ఎన్నోసార్లు గ్రామకార్యదర్శికి మొరపెట్టుకున్నా.. సమస్య తీరడం లేదని తెలిపారు. మండు వేసవిలో తమ పరిస్థితి ఏ అధికారి సైతం పట్టించుకోకపోవడంతో కష్టాలు తప్పడం లేదని మహిళలు ఆక్రోశం వెళ్లగక్కారు. అధికారులు ఇప్పటికైనా మూసిన వాల్వ్‌లను తెరిపించడంతో పాటు మరిన్ని వాల్వ్‌లను ఏర్పాటుచేసి నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుచున్నారు. ఈవిషయమై ఎంపీడీవో వెంకయ్యగౌడ్‌ను వివరణ కోరగా గ్రామాన్ని సందర్శించి సమస్యను తెలుసుకుని పరిష్కరిస్తానని తెలిపారు.



పూడ్చివేసిన వాల్వ్ ప్రాంతాన్ని చూపిస్తున్న గ్రామస్తులు

నీళ్లు సరిపోను రావడం లేదు



సరిపోను నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా ఇల్లు ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో నీళ్ల రావడం లేదు. ట్యాంకు సమీపంలో ఉన్నా లాభం లేదు. బోర్లు ఉన్నవారి వద్ద నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నాం.

- కైల సుమిత్ర, ఆలంఖాన్‌గూడ

వాల్వ్‌లు ఏర్పాటు చేయాలి



వాల్వ్‌లను ఏర్పాటుచేసి మూసివేశారు. పల్లపు ప్రాంతంలోని వారికి మాత్రం నీళ్ల రాగా.. ఎత్తైన ప్రాంతంలోని వారికి నీరు రావడం లేదు. పూడ్చిన వాల్వ్‌లను పునరుద్దరించి నీటి సమస్య తీర్చాలి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రామన్నోళ్ల అంజయ్యగౌడ్, ఆలంఖాన్‌గూడ

కేశవ చిత్రాలయంలో ఆధ్యాత్మిక శోభ

- ఘనంగా అష్టాదశ గురుపీఠం ఆవిష్కరణ



అష్టాదశ గురుపీఠం ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్ శాస్త్రి

కొత్తూర్, మే 22: మండల పరిధిలోని తీగాపూర్ గ్రామ శివారులో వెలసిన కేశవ చిత్రాలయంలో గురు పూర్ణిమను పురస్కరించుకుని బుధవారం రాత్రి అష్టాదశ గురుపీఠం ఆవిష్కరణను వ్యాస పీఠాధీశులు(వేదవ్యాస ధామ్ నైమిశారణ్య క్షేత్రం-ఉత్తరప్రదేశ్) శ్రీఅనిల్‌కుమార్ శాస్త్రి స్వామి మహరాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే 64 చతుష్షి కళలకు సంబంధించి ఏర్పాటుచేసిన చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. కేశవ చిత్రాలయం (పంచ భూతీశ్వర ఆలయ వ్యవస్థాపకుడు, రాష్ట్రపతి పురస్కార్ గ్రహీత డాక్టర్ పీజీ కేశవులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. గురుపీఠం ఆవిష్కరణతో కేశవ చిత్రాలయంలో ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంది. వ్యాసపీఠాధీశులు అనిల్‌కుమార్ శాస్త్రి మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టూ, ముట్టూ ఎక్కడా లేనివిధంగా 64 చతుష్షి చిత్ర కళాశాలను ప్రారంభించడం ఎంతో ఆనంద దాయకమన్నారు. వ్యాస మహర్షి పరిపూర్ణ అనుగ్రహం, మహిమాన్వితమైన మహాశక్తి ఈ ప్రాంతంలో ఉండడం వల్ల, శిష్యగణం అన్ని కళల్లో ఉత్తీర్ణులై, జీవనోపాధికి మార్గం కలగాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తన చేతుల మీదుగా అష్టాదశ గురుపీఠం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకుమారి, ధర్మేంద్ర స్వామీజీ, కంచర్ల గోపన్న మునిమనవడు వెంకటరమణ, రామలక్ష్మీ, భక్తులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు



జి.అరుంధతి, పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపాల్

మేడ్చల్ టౌన్, మే 22 : మేడ్చల్‌లో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేశామని మేడ్చల్ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల కోఆర్డినేటర్, కాలేజీ ప్రిన్సిపాల్ జి.అరుధతి బుధవారం తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 24న నిర్వహిస్తున్నామని, ఉదయం 11 నుంచి మతిధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష నిర్వహణకు మేడ్చల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్ఎస్ఆర్ కళాశాల, స్ఫూర్తి కళాశాల, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, ప్రభుత్వ ఐటీఐ, హైటెక్ పాఠశాల, హైటెక్ మోడర్న్ స్కూళ్లలో 8సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. పాలిటెక్నిక్‌లోని మూడు సంవత్సరాల కోర్సులకు ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లమా కోర్సులతో పాటు, వ్యవసాయ డిప్లమా, వెటర్నరీ డిప్లమా కోర్సులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్ష రాసే విద్యార్థులను గంట ముందు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సీఎంఆర్ షీట్‌లను రెండు వైపులా నింపి ఇవ్వాలని తెలిపారు.



కొర్విచెడ్ వద్ద పొలాన్ని ట్రాక్టర్‌తో చదను చేస్తున్న రైతు

వేసవి దుక్కులతో ఎంతో మేలు

బషీరాబాద్, మే 22: వాన కాలం సీజన్‌కు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు తమ పొలాలను ట్రాక్టర్లు, గుంటక, నాగళ్లతో దుక్కులు, యంత్రాలతో చదను చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో రైతులు పొలాల్లో దుక్కులు సిద్ధం చేసుకుంటే మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. గతంలో సాగుచేసిన పంటలు పూర్తి కాగానే వేసవి దుక్కులు సిద్ధం చేసేవారు. వానకాలం సీజన్ ప్రారంభమయ్యే నాటికి రెండు, మూడు సార్లు వేసవి దుక్కులు దున్నేవారు. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా వర్షాలు పడగానే హడావుడిగా దుక్కులు సిద్ధం చేసి అప్పటికప్పుడే విత్తనాలు నాటుతున్నారు.దీని వల్ల విత్తనాల మొలకల శాతం తగ్గుతుందని, అంతే కాక మొలిచిన మొలకలు ఆరోగ్యంగా ఎదగక దిగుబడిపై ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వేసవి దుక్కులు లోతుగా చేయడం వల్ల కలిగే లాభాలు, ప్రయోజనాలపై బషీరాబాద్ ఏవో సూర్యప్రకాష్ ఇలా వివరించారు.

దుక్కులతో ప్రయోజనాలివీ..

ప్రతి రైతు తప్పనిసరిగా దుక్కులు లోతుగా దున్నుకోవాలి. ఏడాది సాగు చేసిన పంటకు తెగుళ్ల, రోగాలకు సంబంధించిన రకరకాల లార్వా భూమి పొరల్లో ఉంటాయి. వేసవి దుక్కులతో అవి బయటకు వచ్చి ఎండ తీవ్రతకు చనిపోతాయి. దీంతో పాటు గత ఏడాది సాగు చేసిన పంటల వ్యర్థాలు భూమిలో కలిసిపోయి ఎరువుగా మారతాయి. భూమి పొర గుల్లగా మారి మట్టిలోకి గాలి వెళ్తుంది. దుక్కితో వర్షపు నీరు భూమికి ఇంకి చల్లబడుతుంది. చల్లబడ్డ నేలలో విత్తనాలు వేస్తే మొలక శాతం ఎక్కువగా ఉంటుంది. అలాగే మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతాయని తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి
- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ కు వినతిపత్రం అందజేత



వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్యగౌడ్

కడ్తాల్, మే 22: గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి అందక మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథిని సంఘం నాయకులతో నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయమై నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో లోగడ చేసిన పనుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో గత ప్రభుత్వ ఆదేశానుసారం వైకుంఠ ధామాలు, పల్లెప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డ్‌లు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్యం, క్రీడా ప్రాంగణాల ఏర్పాటు తదితర పనులు చేపట్టడం జరిగిందని వివరించారు. ఆయా పనులకు ప్రభుత్వం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో అప్పటి సర్పంచ్‌లు లక్షల రూపాయలు అప్పులు చేసి పనులు పూర్తి చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గత, ప్రస్తుత ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడం సరికాదని లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్యగౌడ్‌లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, ఉపాధ్యక్షుడు గంటి మదుసూధన్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, సముద్రాల రమేశ్, పంబ కరుణాకర్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



తండాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గిరిజనుల ఆందోళన

కులకచర్ల, మే 22: తండాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని మండలంలోని ఘనపూర్ పంచాయతీ పరిధి గోప్యనాయక్, సుబ్యానాయక్, సక్ర్యానాయక్ తండాల గిరిజనులు బుధవారం కులకచర్లలోని సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. సబ్‌స్టేషన్‌లో ఉన్న ఏఈ సాయికృష్ణ వినతిపత్రం తీసుకునేందుకు బయటకు రాకపోవడంతో విద్యుత్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏఈ వచ్చి వినతి పత్రాన్ని తీసుకున్నారు. తండాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోందని, సిబ్బందికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ తాగునీరు రావడం లేదని, పంచాయతీ బోరు మోటార్లకు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. విద్యుత్ స్తంభాలు లేక దీపాలు వెలగడం లేదన్నారు. అధికారులు స్పందించకుంటే కులకచర్ల చౌరస్తాలో ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నర్సరీ, డంపింగ్ యార్డును పరిశీలించిన డీఎల్‌పీవో

కొడంగల్ రూరల్, మే 22 : కొడంగల్ మండలం హుసేన్‌పూర్ పంచాయతీలో డీఎల్‌పీవో శంకర్‌నాయక్ బుధవారం నర్సరీ, స్మశాన వాటిక, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. నర్సరీల్లో మొక్కలను వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొండన్న, ఫీల్డ్ అసిస్టెంట్ బసప్ప పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నర్సాపూర్‌లో మహారాష్ట్ర పోలీసుల సోదాలు

- నిషేధిత ద్రవ మత్తు పదార్థం, తయారీ సామాగ్రి స్వాధీనం
- పోలీసులు వచ్చారన్న సమాచారంతో కీలక వ్యక్తి పరారీ
- కుటుంబ సభ్యుల్లో ఒకరిని విచారించి వదిలేసిన పోలీసులు
- కలకలం రేపిన సంఘటన

మర్పల్లి, మే 22 : బెంగళూరు రామేశ్వరం కేఫే బాంబు పేలుళ్లకు సంబంధం ఉందని అనుమానిస్తున్న ఓ వ్యక్తిని వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన మరువక ముందే మర్పల్లి మండలం, నర్సాపూర్ శివారులోని ఓ రహస్య స్థలంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. నర్సాపూర్ గ్రామంలో చెరువు పక్కనే ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు బుధవారం తెల్లవారు జామున ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మహారాష్ట్ర పోలీసులు



నర్సాపూర్‌లో ఉన్న రేకుల షెడ్డు

రేకుల షెడ్డులో మూడు లీటర్ల వరకు ద్రవ మత్తు పదార్థంతో పాటు నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేసే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలియవచ్చింది.. సంఘటన స్థలంలో స్వాధీనం చేసుకున్న సామాగ్రి వివరాలను వారు తమ ఉన్నతాధికారులకు వివరించినట్లు చెబుతున్నారు. సంఘటన స్థలం ఏ సర్వే నెంబర్‌లోకి వస్తుంది, యజమాని ఎవరు అనే సమాచారం కోసం మహారాష్ట్ర పోలీసులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం అధికారులను సంప్రదించి వివరాలు సేకరించారు. నర్సాపూర్ గ్రామంలో సర్వే నెం.48లో ఉన్న పొలంలో రేకుల



సామాగ్రి లోడ్ చేసిన ఆటో

షెడ్డులో గత కొన్ని రోజులుగా నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతోనే మహారాష్ట్రకు చెందిన థానే పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తోంది. మత్తు పదార్థాలు సరఫరా చేసే వ్యక్తుల ద్వారా రాబట్టిన సమచారం మేరకే మహారాష్ట్ర పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డు వద్దకు పోలీసులు వచ్చిన విషయాన్ని పసిగట్టిన అక్కడున్న ఓ వ్యక్తి చెరువులో దూకి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. కాగా, పారిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కొంత సమాచారం సేకరించి అతడిని వదిలేశారు. తాము విచారణకు హాజరు కావాలని సమాచారం ఇచ్చినప్పుడు రావాలంటూ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డులో స్వాధీనం చేసుకున్న సామాగ్రిని ఓ వాహనంలో తమ వెంట మహారాష్ట్రకు తరలించారు. ఈ సంఘటనపై జిల్లా, స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం. కాగా, ఈ సంఘటన జిల్లాలో కలకలం రేపింది.



హుస్సేన్‌నాయక్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

యాచారం, మే 22 : గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించి ఆదుకుంటామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ తెలిపారు. మారుమూల గ్రామాల్లో గిరిజనులు దుర్భర జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారి కష్టాలు తీర్చడం కోసం మారుమూల గ్రామాల్లో పర్యటించనున్నట్లు ఆయన చెప్పారు. బుధవారం యాచారం మండల బీజేపీ అధ్యక్షుడు తాండ్ర రవీందర్, గిరిజన మోర్చా మండలాధ్యక్షుడు సపావట్ గణేష్‌నాయక్ తదితరులు నగరంలోని ఎస్టీ కమీషన్ కార్యాలయంలో ఆయన్ను కలిసి గిరిజనుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జాటోత్ హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతీ వ్యక్తి బాధ్యత తీసుకోవాలన్నారు. నేటికీ నిరుపేదలు అనేక ఇబ్బందుల పాలవుతుండడం బాధాకరమన్నారు. అవసరమైన చోట పాఠశాలలు, హాస్టళ్ల ఏర్పాటుకు చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా నాయకుడు ప్రసాద్ తదితరులున్నారు.

ఘనంగా నృసింహస్వామి కల్యాణం

- పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ప్రత్యేక పూజలు

శంషాబాద్, మే 22 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ నర్సింగ్ మందిర్ దేవాలయంలో బుధవారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి జయంత్యుత్సవాలు, కల్యాణం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్.గణేశ్‌గుప్తాలులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ వై.కుమార్, నాయకులు దూడల వెంకటేశ్‌గౌడ్, సిమెంట్ శ్రీకాంత్, కృష్ణ, వివేకతో పాటు మున్సిపాలిటీలోని వివిధ బస్తీలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.



శంషాబాద్ : పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

వైభవంగా చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కందుకూరు : మండంలోని ఉట్లపల్లి దేవునిగుట్టపై వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో నాలుగు రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో వేదపండితులు రేవెళ్ల రాజుశర్మ నేతృత్వంలో ఈనెల 25వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం వరకు దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. బుధవారం ఉదయం మహాగణపతి పూజతో బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. అనంతరం, విశ్వక్సేన పూజ, పుణ్యహవాచనం, పంచగవ్య ప్రాశణంతో పాటు అఖండ దీపారాధనం, ధ్వజారోహణం, దేవతాహ్వానం, మండప పూజలు, అంకురారోపణం, అగ్ని ప్రతిష్ట తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమం, యజ్ఞాలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. నేడు మధ్యాహ్నం ఒంటిగంటకు స్వామివారి తిరుకల్యాణోత్సవాన్ని జరిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అన్నిరకాల సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు లక్ష్మణ్‌ముదిరాజ్ తెలిపారు.



కందుకూరు : హోమంలో పాల్గొన్న భక్తులు



ఆమనగల్లు : పూజలో పాల్గొన్న కౌన్సిలర్ రాధమ్మ వెంకటయ్య, భక్తులు

అభయాంజనేస్వామి ఆలయ వార్షికోత్సవం

ఆమనగల్లు, మే 22 : పట్టణంలోని గంగభవాని బీసీ కాలనీలో గల శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం 9వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. పట్టణంతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ రాధమ్మవెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకలు కొనసాగాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ ఎంగళి బాలకృష్ణ, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పరమేశ్, భీమనపల్లి సత్తయ్య, కోశాధికారి సాయికుమార్, సభ్యులు మురళి, ప్రసాద్, బాలింగం, ఎంగళి రమేశ్, తదితరులున్నారు. కాగా, అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన ఎంగళి రాఘవేందర్ శ్రీదీప్తి దంపతులు రూ.15,116 విరాళం ప్రకటించారు. ఆలయ ఆవరణలో నిర్వాహకులకు విరాళం అందజేశారు. రాఘవేందర్‌దీప్తి దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించి అభినందించారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మల్లేశ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తలకొండపల్లి, మే 22: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలో జంగారెడ్డిపల్లి-ఆమనగల్లు ప్రధాన రహదారిపై బుధవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన పూరాకుల మల్లేశ్(40) బైక్‌పై ఆమనగల్లుకు వెళ్లి తిరిగి చౌదర్‌పల్లి గ్రామానికి వస్తున్నాడు. జంగారెడ్డిపల్లి సమీపంలో ఎదురుగా ఆమనగల్లు వైపు వెళ్తున్న మహేశ్వరం డిపో బస్సు బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న మల్లేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై శ్రీకాంత్ సందర్శించి పంచనామా చేశారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం



పోలీసులు సంరక్షణలో సుజిత్‌దాస్

కొత్తూర్, మే 22: కొత్తూర్ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో కాంట్రాక్టర్ వద్ద దినసరి కూలీగా పనిచేస్తూ తప్పిపోయిన సుజిత్‌దాస్ ఆచూకీ లభ్యమైనట్లు ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సుజిత్‌దాస్ తిరిగి రాకపోవడంతో కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం సాయంత్రం పోలీసులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గాలింపులు జరుపుతుండగా, సుజిత్‌దాస్ తచ్చాడుతూ కనిపించడంతో అదుపులోకి తీసుకుని కొత్తూర్‌కు తీసుకవచ్చారని పేర్కొన్నారు. సుజిత్‌దాస్‌ను వారి కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



జంగయ్య

ఆమనగల్లు, మే 22: మండల పరిధిలోని నల్లవారిపల్లి గ్రామానికి చెందిన తెల్లమల్ల జంగయ్య అదృశ్యమయ్యాడు. ఆమనగల్లు పట్టణంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై బాల్‌రామ్‌నాయక్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తెల్లమల్ల జంగయ్య(67) ఈనెల 20న ఆమనగల్లు పట్టణంలో అంబేడ్కర్ కాలనీలో నివాసముంటున్న కూతురు వద్దకు వచ్చాడు. 21న ఉదయం 10:30 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా జంగయ్య ఆచూకీ లభ్యం కాలేదు. జంగయ్య మానసిక పరిస్థితి బాగాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. జంగయ్య మనుమడు కామల్ల నిఖిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



బావిలో నుంచి శవాన్ని బయటికి తీస్తున్న ఫైర్ సిబ్బంది

మాడ్గుల, మే 22 : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మంగలి శ్రీను కుమారుడు సాయి నల్లచెర్వు గ్రామ సమీపాన ఉన్న నారాయణ బావిలో ఈతకు కొట్టటానికి వెళ్లి మంగళవారం గల్లంతైన తెలిసిందే. బావిలో నీరు నిండుగా ఉండటంతో పోలీసులు, ఫైర్ ఇంజన్ సిబ్బంది శవాన్ని బయటికి తీయలేకపోయారు. గ్రామస్తులు బావికి మూడు మోటర్లను బిగించి నీరును తోడించినా నీరు తగ్గలేదు. బావిలో పులిచింతచెట్టు కూలి ఉండటంతో చెట్టు మధ్యలో సాయి మృతదేహం చిక్కుకొని ఉంది. ఎట్టకేలకు బుధవారం పోలీసులు, ఫైర్ సిబ్బంది మృతదేహాన్ని బయటికి తీశారు. అనంతరం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, మృతుడు సాయి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలి

- జడ్పీటీసీ అనురాధ పత్యనాయక్



మాట్లాడుతున్న అనురాధ పత్యనాయక్

ఆమనగల్లు, మే 22 : పట్టణంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, జడ్పీటీసీ అనురాధపత్యనాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆర్డీవో కార్యాలయం అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె అన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆమనగల్లు పట్టణంలో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు ఏళ్ల కాలంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నా.. ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలను కలిపి ఆమనగల్లులో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు సాధన కోసం త్వరలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో కార్యాలయం అందుబాటులో లేక రైతులు, ప్రజలు దూర, ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారని, గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాలతో పాటు 2016లో కొత్తగా ఏర్పాటు చేసిన కడ్తాల మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాలను కందుకూరు, మాడ్గులను ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం పరిధిలోకి చేర్చడం జరిగిందన్నారు. ఈనేపథ్యంలో కార్యాలయాలు అందుబాటులో లేక ఏళ్లకాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం, పాలక ప్రజాప్రతినిధులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈవిషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజాసంఘాలతో కలిసి రాజకీయాలకతీతంగా ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అనురాధపత్యనాయక్ అన్నారు. నాయకులు ఉప్పల రాములు, డేరంగుల వెంకటేశ్, రమేశ్‌నాయక్, ఆనంద్, కృష్ణవేణి, గణేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యం
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ జాటోత్ నర్మద

మంచాల, మే 22 : గ్రామాల్లో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినా యంత్రాంగం పట్టించుకోవడం లేదని, వారానికోసారైనా నీటినందించడం లేదని బుధవారం జరిగిన మంచాల మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఎంపీపీ జాటోత్ నర్మద అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యంపై సమీక్ష నిర్వహించారు. తాగునీటిపై జరిగిన చర్చలో చెన్నారెడ్డిగూడ ఎంపీటీసీ కాట్రోత్ పరంగా మాట్లాడుతూ తమ గ్రామానికి వారానికోసారైనా తాగునీటి సరఫరా జరపాలని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫలితంగా అన్నదాతలు కొనుగోలు కేంద్రంలో పడిగాపులు గాస్తూ ఇబ్బందులు పడుతున్నారని ఆరుట్ల ఎంపీటీసీ చీరాల రమేష్ సభ దృష్టికి తెచ్చారు. తరుగు పేరుతో క్వింటాలుకు 5 కిలోల చొప్పున అదనంగా దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. ఎంపీటీసీలు పేర్కొన్న సమస్యలపై అధికారులచే వివరణ ఇప్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్మద మాట్లాడుతూ వర్షాకాలం సమీపించినందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని, స్తంభాలు, వైర్లవెంట అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సత్వరమే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేసి అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమచేసేట్లు చర్యలు తీసుకోవాలని డీసీఎంఎస్ అధికారులను కోరారు. సమావేశంలో జడ్పీటీసీ మర్రి నిత్యనిరంజన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, ఎంపీడీవో బాలశంకర్, తహసీల్దార్ ప్రసాద్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జయానందం, మధుసూదన్‌రెడ్డి, నర్సింగ్ అనిత, ఎడమ నరేందర్‌రెడ్డి, పి.సుకన్య, కావలి శ్రీనివాస్, చీరాల రమేష్, సూపరింటెండెంట్ జంగయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

ఆమనగల్లు, మే 22: ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లి 11 కేవీ విద్యుత్ లైన్‌లో చెట్ల తొలగింపు కారణంగా నేడు(గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సీతారామ్ తెలిపారు. జంగారెడ్డిపల్లి ఫీడర్‌పై ఉన్న ఇండస్ట్రీస్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆమనగల్లు రూరల్ 11 కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మేడిగడ్డ, సంకటోనిపల్లిలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

శంషాబాద్ రూరల్ పరిధిలో..

శంషాబాద్ రూరల్, మే 22 : మరమ్మతుల కారణంగా మున్సిపల్, మండల పరిధిలోని కొత్వాల్‌గూడ, కవ్వగూడ, ఆర్‌కె గార్డెన్, ఎంఆర్‌వో ఆఫీస్, మహావీర్ బిల్డర్స్, కూరగాయల మార్కెట్ ఇన్‌బైఇంచ్ ఖుషీలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్వాల్‌గూడ ఫీడర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ షేక్ బాషా చెప్పారు. కోత్వాల్‌గూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

యాచారం మండల పరిధిలో..

యాచారం, మే 22 : ప్రమరమ్మతుల కారణంగా నేడు(గురువారం) భానుతండా ఫీడర్, మల్కీజ్‌గూడ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సందీప్‌కుమార్ తెలిపారు. భానుతండా ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదని, అలాగే మల్కీజ్‌గూడ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

ఇబ్రహీంపట్నం పరిధిలో..

ఇబ్రహీంపట్నం, మే 22 : ఇబ్రహీంపట్నం టౌన్ ఎంబీఆర్ నగర్ ఫీడర్ కింద ఉన్న కాలనీల్లో నేడు (గురువారం) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇబ్రహీంపట్నం టౌన్ బృందావన్‌కాలనీ, కేవీతండా, తిరుమలహిల్స్, ఎంబీఆర్ నగర్, రాజమహేంద్ర కళాశాల, డీపీఎస్ స్కూల్ ఏరియాలో విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల ఫీడర్ కింద ఖానాపూర్, గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల చుట్టుపక్కల గృహవినియోగదారులు, వ్యవసాయ పంపుసెట్లకు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు

షాబాద్, మే 22 : సబ్సిడీపై (జనుము, జీలుగ) పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం తెలిపారు. వానాకాలం సీజన్లో 60 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. షాబాద్ మండలంలో జనుములు 140 క్వింటాళ్లు, జీలుగ 26 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనుము 40 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.1,448, జీలుగా 36 కిలోలకు రూ.1,116 రైతులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మండల పరిధిలోని ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు లు జిరాక్స్‌లు తీసుకొని షాబాద్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

షాద్‌నగర్‌అర్బన్: సేంద్రియ వ్యవసాయ సాగుబడి కోసం 60శాతం సబ్సిడీపై జనుము, జీలుగ పచ్చరొట్ట విత్తనాలను సరఫరా చేస్తున్నామని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కేశంపేట చౌరస్తాలోని రైతు ఆగ్రోస్ కేంద్రంలో పచ్చరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్వింటాలు జనుము ధర రూ.9,050 ఉండగా.. సబ్సిడీపై రూ.3,620లకు, జీలుగ క్వింటాలుకు రూ.9,300 ఉండగా రూ.2,790లకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. అవసరమున్న రైతు ఐదు ఎకరాల్లో సాగు చేసుకునే విధంగా రెండు బస్తాలను ఇస్తామని తెలిపారు. పచ్చరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకుని క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని గానీ, మండల వ్యవసాయాధికారిని గాని సంప్రదించాలని తెలిపారు. తొలకరి వర్షాలకు పచ్చరొట్ట విత్తనాలైన జనుము, జీలుగను సాగుచేసి, పైరు ఏపుగా పెరుగగానే భూమిలో కలియదున్ని పంటలను సాగుచేస్తే మంచి ఎరువుగా పైరుకు బలాన్ని ఇచ్చి, అధిక పంట దిగుబడులు వస్తాయని తెలిపారు. రసాయనిక ఎరువులకు బదులుగా పచ్చరొట్ట విత్తనాలను సాగుచేసి, అధిక పంట దిగుబడులను సాధించాలని సూచించారు.

రాజేంద్రనగర్‌లో నేడు విత్తన మేళా

ఇబ్రహీంపట్నం, మే 22: రైతులు విత్తనాలు కొనుగోలు చేయడానికి రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నేడు (గురువారం) విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి తెలిపారు. ఈ మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి, మే 22 : మండల పరిధిలోని పడమటి తండాకు చెందిన పాత్లావత్ కోటి అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం కోటి కుటుంబాన్ని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3 వేలు సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో దాన్య, శంకర్, వంశీ, రమేశ్, శ్రీనివాస్, బీచ్య, హన్మ, రాములు, తావుర్య తదితరులు ఉన్నారు.

నేత్రదానంతో ఇతరులకు దృష్టి భాగ్యం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న చంద్రశేఖర్

ఆమనగల్లు, మే 22 : ఒక్కరి నేత్రదానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ నటరాజ్ యాదయ్య అన్నారు. ప్రతీ ఒక్కరు మరణానంతరం నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని యాదయ్య ప్రారంభించారు. శిబిరంలో కంటి వైద్య సహాయకులు ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య బృందం 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 28 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి ఓపీఎల్ ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించారు. నేత్ర సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అంధత్వ నివారణ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఒక ఉద్యమంగా ముందుకు తీసుకుపోతుందని యాదయ్య పేర్కొన్నారు. సామాజిక సేవల్లో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌వో ఎంఏ పాషా, కోశాధికారి కొరివి వెంకటయ్య, సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి, ఎంగళి బాలకృష్ణ, ఏలె శివకుమార్, ఆసుపత్రి సిబ్బంది తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, శేఖర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

తలకొండపల్లి, మే 22 : రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజు సూచించారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. మండలం పరిధిలోని వెల్జాల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం రాజు సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించి తూకాలు వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల వద్ద తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు వెల్జాల గ్రామంలో విత్తన, ఎరువుల దుకాణాలను రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. రైతులు తదితరులు ఉన్నారు.



వెల్జాల్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో రాజు

జీవాలకు టీకాలు వేయించాలి



మద్దూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, మే 22 : పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మద్దూర్ గ్రామంలో బుధవారం జీవాలకు వ్యాధినిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాలకు వచ్చే చిటిక వ్యాధి, గొంతువాపు వ్యాధి నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 22 నుంచి 31 వరకు అన్ని గ్రామాల్లో కొనసాగుతుందని తెలిపారు. ప్రతి రైతు పశువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా జగన్‌మోహన్‌రెడ్డి



కందుకూరు, మే 22 : మండంలోని జైత్వారం గ్రామానికి చెందిన బైరు జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నియమించిన 8 మంది ఉన్న కమిటీలో రంగారెడ్డి జిల్లా నుంచి జగన్మోహన్‌రెడ్డిని వైస్ చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యాభ్యాసం చేసిన తాను.. హైకోర్టు న్యాయవాదిగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అలాగే తన సేవలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పదవి రావడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులను మార్గ నిర్దేశకులుగా చేయడమే లక్ష్యం



సునీతకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ప్రొఫెసర్ రవీందర్

మొయినాబాద్ రూరల్, మే 22 : తమ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన విద్యార్థులను భవిష్యత్తులో మంచి మార్గనిర్దేశకులుగా తయారు చేయడమే లక్ష్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన ఆవుల సునీత.. వాణిజ్యం మరియు వ్యాపార నిర్వహణ విభాగంలో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మ్యూచువల్ ఫండ్స్ విజ్ ఇన్వెస్టర్స్ పర్‌సెప్షన్స్ ఎ సెలక్ట్ స్టడీ' అనే అంశంపై ప్రొఫెసర్ వెంకట జనార్దన్‌రావు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆమెను సాత్వికరెడ్డి బుధవారం అభినందించారు. అనంతరం మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో అభ్యసించే విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇవ్వడమే లక్ష్యమన్నారు. విద్యతో పాటు పరిశోధనలను ఎంతో ముఖ్యమని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రవీందర్, జగదీశ్వర్, రాజు, ఇతర అధ్యాపకులతో పాటు పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు విద్యార్థులు ఉన్నారు.